# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ప్రేమించి పెళ్ళి చేసుకుందని...
# కుమార్తెకు తండ్రి అంత్యక్రియలు

**- శ్రీరంగరాజపురం మండలం, పిళ్లారికుప్పంలో సంచలనం**



బతికి వున్న కుమార్తె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తండ్రి

చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కుమార్తె ప్రేమించి పెళ్ళి చేసుకుందని ఆగ్రహానికి గురైన తండ్రి కుమార్తె మృతి చెందిందని ఇంట్లో అంత్యక్రియలు నిర్వహించి సంచలనం సృష్టించిన సంఘటన చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పిళ్లారికుప్పం గ్రామంలో జరిగింది. పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డికి ఇద్దరు కుమార్తెలు. ఇందులో ఒక కుమార్తె తిరుపతిలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈమె గ్రామంలో అదే కులానికి చెందిన అబ్బాయిని గత కొంతకాలంగా ప్రేమిస్తోంది. అయితే వీరి ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడం. గ్రామంలో అబ్బాయి పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తుండగా తిరుపతి సిటీలో బిటెక్ చదువుతున్న అమ్మాయి ఇష్టపడింది. వీరిద్దరు తమ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని ప్రయత్నించారు. అయితే అమ్మాయి తరపు నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో తనను ప్రేమించిన యువకుడి వైపు ఆ అమ్మాయి మొగ్గు చూపింది. గ్రామం నుండి గురువారం ప్రేమించిన ఇద్దరు మాయం అయ్యారు. గుడికి వెళ్ళి వివాహం చేసుకుని ఒకటయ్యారు. ఈ క్రమంలో తన కుమార్తె తాను అంగీకరించని యువకుడిని పెళ్లి చేసుకుందని ఆగ్రహానికి గురైన తండ్రి ఇకపై తనకు ఒక కుమార్తె లేదని, ఆమెకు గురువారం అంత్యక్రియలు నిర్వహించాడు. ఇంట్లో తన కుమార్తె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, బంధువులు, గ్రామస్తులను ఇంటికి పిలిచి భోజనం పెట్టాడు. ఇదే తరహాలో ఇదే గ్రామంలో ఇది వరకు సైతం ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. శ్రీరంగరాజపురంలో తన మాట వినలేదని సొంత కుమార్తెకు తండ్రి అంత్యక్రియలు నిర్వహించడం సంచలనం కల్గించింది.

## గుడిమల్లం ఆలయాన్ని...
# దత్తత తీసుకుంటాం

**-శివరాత్రి సమీక్షలో మంత్రి ఆనం నారాయణరెడ్డి**





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి- సమావేశానికి హాజరైన అధికారులు,ప్రజాప్రతినిధులు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఐదేళ్ళ వైకాపా పాలనలో ఐదు ఆలయాలను తాకలేదని ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఆలయాల రూపు రేఖలు మార్చుటకు ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు దిశ దేశ నిర్దేశం చేసారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి ఇఓ బాపిరెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. శ్రీశైలం,కనకదుర్గమ్మ ఆలయం కాణిపాకం, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలంలో మాస్టర్ ప్లాన్‌తో పాటు టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు ఇందుకు కమిటి ఏర్పాటు చేసారని ఇందులో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయశాఖ మంత్రిగా తాను,టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్, రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డిలతో ఒక సమావేశం అయ్యిందన్నారు. బడ్జెట్ సమావేశాల తరువాత మళ్ళి కూర్చొని నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వివరించారు.

**శ్రీకాళహస్తి శివరాత్రిలో అందరూభక్తులే:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పలు కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి మీడియాకు వివరించారు.ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారి చేస్తూ శివరాత్రి పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్,ఎస్‌పిలదే అని మంత్రి వివరించారు. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల క్యూలైన్ల నిర్వహణలో దర్శనం వేగవంతం చేయాలన్నారు.క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్ళ బాటిల్స్‌లోనే ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. చిన్నపిల్లలకు బిస్కెట్లు, పాలు, మజ్జిగ ఇవ్వాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ ఎంతో అవసరం అన్నారు. వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత కోసం పోలీసు శాఖతో సమన్వయంగా పని చేయాలన్నారు.అత్యవసర వైద్యసేవలు, అంబులెన్స్‌లు, ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు దివ్యాంగులు, వృద్దులకు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ ప్రతి శివరాత్రిని కొత్త శివరాత్రిలా భావించి ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు వాలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకుంటున్నామన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు పొరుగున ఉన్న ఇతర రాష్ట్రాల ప్రజలు వస్తారు కాబట్టి ఇబ్బందుల్లేకుండా దర్శనం విశేష ప్రాచుర్యం కల్పించటమే లక్ష్యంగా ఆదేశించామన్నారు.

బాల్య వివాహాల కట్టడికి కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా కలెక్టర్ ఆర్ వెంకటేశ్వర్ అన్నారు.కమాండ్ కంట్రోల్ బలోపేతం చేస్తూ సిసి కెమెరాలు,డ్రోన్ కెమెరాలు సామాన్య, విఐపిలకు గట్టి భద్రత కల్పిస్తున్నట్లు ఎస్‌పి సుబ్బరాయుడు వివరించారు. ఇప్పటికే శివరాత్రి ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ఇఓ బాపిరెడ్డి అన్నారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతం కన్నా మెరుగ్గా జరిపించటానికి అధికారులు సహాకరించాలన్నారు. వచ్చిన ప్రతి భక్తునికి స్వామి అమ్మవార్ల పాకెట్ క్యాలండర్లను అందజేయుటకు సూచించారు. చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు,మంత్రి, ఎంఎల్‌ఏ సూచించినట్లు మా వంతు కృషి చేస్తామన్నారు.ఈ జాయింట్‌కలెక్టర్ సందీప్ రఘువంశీ, ఎఎస్‌పి రవిమనోహారాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని...ప్రధాని భ్రష్టు పట్టించారు

**ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి**



గంగవరంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో షర్మిలారెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: కేంద్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ అధికారంలో వున్న పదేళ్ళ పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అద్భుతంగా నడిచిందని, ప్రధాని నరేంద్రమోడి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పథకంను భ్రష్టు పట్టిస్తున్నారని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మన్రేగ పరిరక్షణ యాత్రలో భాగంగా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ముందుగా బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి దండపల్లి క్రాస్ వద్ద వున్న దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 65 అడుగుల విగ్రహానికి భారీ పూలమాల వేసి ఆమె నివాళులు అర్పించి అనంతరం నల్లగుట్లపల్లి గ్రామంకు వైఎస్ షర్మిలా భారీ ర్యాలీతో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధి హామీ పథకం మొదలై రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వున్న పదేళ్ళ పాటు ఈ పథకం అద్భుతంగా నడిచిందన్నారు. ప్రధానిగా మోడి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంను భ్రష్టు పట్టించి, ఉపాధికి గ్రహణం పట్టించారని ధ్వజమెత్తారు. మన్రేగను నిర్వీర్యం చేయాలని కూటమి ప్రభుత్వాలు కుట్రలకు పాల్పడుతున్నాయని దేశ వ్యాప్తంగా ఉపాధి పథకానికి అయ్యే ఖర్చు 86 వేల కోట్ల రూపాయలు కాగా ఈ మొత్తంను బిజెపి తన కాంట్రాక్టర్ల జేబుల్లోకి పెట్టడానికి ఈ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చిందని ఆమె ఆరోపించారు. విబిగ్రామ్‌జీ అనే చట్టం ఒక పనికి మాలిన పథకం అని, రాష్ట్రాల మీద భారం తప్పా లాభం లేదన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక సగటున 52 రోజుల పని మాత్రమే కూలీలకు కల్పిస్తున్నారని ఆరోపించారు. చేసిన పనులకు సైతం కూలీలకు వేతనాలు చెల్లించకుండా వంద రోజుల పని ఇవ్వలేని వాళ్ళు 125 రోజుల పాటు పని కల్పిస్తామని పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్రంలో 18 లక్షల జాబ్‌కార్డులు తొలగించారని, వైఎస్ఆర్ హయాంలో 1.10 కోట్ల కార్డులు వుండేవన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పలమనేరు నియోజకవర్గ అభ్యర్థి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ గారూ..
# కమర్షియల్ కాంప్లెక్స్ స్థానంలో...
# ఎస్సీ హాస్టలా!

**-ప్రజల మనోగతం మరిస్తే మూల్యం చెల్లించక తప్పదు**
**-చంద్రగిరి తెలుగు తమ్ముళ్ళలో పెరుగుతున్న అసంతృప్తి**

చంద్రగిరి-ప్రభాతవార్త:



కమర్షియల్ కాంప్లెక్స్ వుండవలసిన ప్రదేశంలో ఎస్సీ హాస్టల్ నిర్మించడం పట్ల ఎంఎల్‌ఏ పులివర్తి నాని పునరాలోచన చేస్తేనే మంచిదనే అభిప్రాయం తెలుగు తమ్ముళ్ళు నుండి వ్యక్తమవుతున్నది. చారిత్రాత్మక చంద్రగిరి టవర్ క్లాక్ వంటి సెంటర్లో అత్యంత విలువైన భూమి కావడంతో భవిష్యత్ అవసరాలను గుర్తించి పంచాయతీ కాంప్లెక్స్ నిర్మించుకోవడం వలన అనేక మంది నిరుద్యోగులకు,స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించగలవని ముక్తకంఠంతో చెబుతున్నారు. మరో ఒకటి రెండేళ్ళలో తిరుపతి నగర పాలక సంస్థలో విలీనమయ్యే అవకాశాలు మెండుగా వున్న చంద్రగిరిలో తగిన కార్యాలయం నిర్మించుకునేందుకు ఇంతకంటే మెరుగైన భూమి వేరొకటి లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక హాస్టల్స్ నిర్మించి, నిర్వహించబడుతున్న థమ్సప్ గోడౌన్ సమీపంలో ఎస్సీ హాస్టల్ నిర్మించడమే సబబుగా వుంటుందని అంటున్నారు. ముఖ్యంగా బస్టాండ్‌లో హాస్టల్ నిర్మించడం వలన విద్యార్థులు గోడదూకి పారిపోయే పరిస్థితులు ఎదురవుతాయని అంటున్నారు. మరీ ముఖ్యంగా రణగొణ ధ్వనుల నడుమ విద్యార్థుల చదువు అటకెక్కుతుందనే అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా అధికారంలో ఏ పార్టీ వున్నప్పటికీ ధర్నాలు నిర్వహించే క్రమంలో తప్పకుండా విద్యార్థులను తీసుకువచ్చి రోడ్డుపై కూర్చోబెట్టే అవకాశాలు వంద శాతం వుంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ నందు భోజనం తయారీలో ఏదైనా లోపం ఏర్పడితే విద్యార్థులు కశ్చితంగా టవర్‌క్లాక్ వద్ద బైఠాయించే పరిస్థితి లేకపోలేదు. దీంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరిస్థితి దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షు అన్నచందం కాగలదు. టవర్ క్లాక్ వంటి రద్దీ ప్రదేశంలో హాస్టల్‌కు భూమి కేటాయించడం సరైన నిర్ణయం కాదనే అభిప్రాయం మెజార్టీ ప్రజల్లో, కూటమి నాయకుల్లో, రాజకీయ పక్షాలలో వ్యక్తమవుతున్నది. పంచాయతీ కార్యాలయం నిర్మించి, రోడ్డు వైపున కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం సబబనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఇకనైనా ఎంఎల్‌ఏ మండల స్థాయి కూటమి నాయకులు, స్థానిక ప్రజలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం.!

**-మౌనరోధనలో మెడికల్ కళాశాల**

కోట్లరూపాయ విలువైన తమ భూమిని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఎస్సీ హాస్టల్‌కు కేటాయించడం, ఇందుకు ఎంఎల్‌ఏ పులివర్తి నాని అంగీకరించడం పట్ల ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, చంద్రగిరి గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం వైద్య సిబ్బంది మౌన రోధనకు గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ వత్తిడిని తట్టుకోలేకపోవడం, ఎంఎల్‌ఏని కలసి కనీసం చెప్పుకోలేని దుస్థితిని ఎదుర్కొంటుండం పట్ల తీవ్రమైన మానసిక వేధనకు గురవుతున్నారు. పుండు మీద కారం చల్లినట్లు హాస్టల్ నిర్మించుకోవలసిన ప్రదేశంలో ఆసుపత్రికి భూమిని కేటాయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

# వర్సిటీల్లో బోధనేతర సిబ్బందిది బలమైన పాత్ర

**- ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్ - ద్రవిడ వర్సిటీలో రాష్ట్రస్థాయి సెమినార్ !!**



కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: విశ్వవిద్యాలయాల్లో బోధనేతర సిబ్బందిది బలమైన పాత్ర అని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం ద్రవిడ వర్సిటీలో రాష్ట్రస్థాయి బోధనేతర సిబ్బంది తొలి సెమినార్‌ను నిర్వహించారు. సంస్థాగత అభివృద్ధిలో బోధనేతర సిబ్బంది పాత్ర అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ శ్రీకాంత్ మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ అకడమిక్ ప్రమాణాల పరిరక్షణలో బోధనేతర సిబ్బంది సేవలు అనివార్య మన్నారు. ఎస్కేయు రిజిస్ట్రార్ రమేష్‌బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయం, సమిష్టి బాధ్యతకు ఈ తరహా వేదికలు కృషి చేస్తాయన్నారు. వైస్‌చాన్సలర్ ఆచార్య ఎం. దొరస్వామి మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధిలో బోధనేతర సిబ్బంది సమాన భాగస్వాములన్నారు. రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పారదర్శక పాలన, సేవా అంశాలు సకాలంలో అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నరేష్, ఎఐఎఇఎ కార్యదర్శి మల్లికార్జున్ సజ్జన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అర్ధగిరి ఆలయ పూర్వ వైభవం

**-ఆలయ ప్రాశస్త్యాన్ని నలు దిశలా వ్యాపింపజేయాలి -ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్**
**-పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం**





పాలకమండలి ఆత్మీయ అభినందన సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాకం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాజంనేయస్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి నూతన పాలకమండలి సమన్వయంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన పాలకమండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం అర్ధగిరిలో ఆట్టహాసంగా జరిగింది. ఈమేరకు నూతన పాలకమండలి ఛైర్మన్ ఎ.రఘుపతి, సభ్యులు వినాయకం, సు బ్రమణ్యం, విభాకరశాస్త్రి, శోభ,ధనలక్ష్మీ, కె.భాగ్యలక్ష్మీ, శ్రీధర్‌నాయుడు, రాధిక ఎ.గుణలు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, కూటమి నాయకులతో కలసి అరగొండ సినిమా థియేటర్ వద్ద నుండి భారీ ర్యాలీగా అర్ధగిరి ఆలయానికి చేరుకున్నారు.వారికి ఆలయ ఈఓ ఇ.మునిశేఖర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలో నూతన పాలకమండలి ఛైర్మన్ రఘుపతి, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా దేవస్థానం సాంస్కృతిక కళావేదికలో నూతన పాలకమండలి ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈకార్యక్రమంకు ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాల్గొని ప్రసంగిస్తూ ఎంతో మహిమాన్వితం, ప్రాశస్త్యం కలిగిన అర్ధగిరి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఇటీవల కాలంలో తగ్గుతతూ వస్తోందని తెలిపారు. ఈఆలయానికి పూర్వ వైభవం తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో వుందని, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుకు సిద్దంగా వుందని తెలిపారు. అలాగే టూరిజం శాఖ ద్వారా 20 లక్షల రూపాయలతో భక్తుల సౌకర్యార్ధం మరుగుదొడ్లను నిర్మిస్తామని తెలిపారు.అలాగే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లును చేపడుతా మని తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వరనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌లు మాట్లాడుతూ పాలకమండలి తమకు పదవి అని కాకుండా బాధ్యతగా భావించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆలయ నూతన ఛైర్మన్ ఎ.రఘుపతి మాట్లాడుతూ స్థానికులు, భక్తుల సహకారంతో ఆలయ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ మునిశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి,గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, అరగొండ, తవణంపల్లె సింగిల్ విండో అధ్యక్షులు ఎ.రంజిత్‌రెడ్డి, అమరేంద్రనాయుడు, జిల్లా బిజెపీ కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సరళకుమారి, మండల జనసేన అధ్యక్షుడు శివ, కూటమి నాయకులు గాంధీ,నాని, కంప్యూటర్ శివ, వెంకటేశ్వర్లుతో పాటు

## సలహాలు సూచనలతో ...
# భక్తులకు చక్కటి సేవలు

**-టిటిడి నూతన ఈఓ ముద్దాడ రవిచంద్ర**





తిరుమల,పిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి భక్తుడిగా ఎంతోమందికి సేవచేసే భాగ్యం దక్కిందని, ప్రభుత్వం,భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని టిటిడి నూతన ఈఓ ,సిఎంఓ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర స్పష్టం చేశారు. భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతన ఈఓగా ముద్దాడ రవిచంద్ర శుక్రవారం ఉదయం ఆలయంలోపల బాధ్యతలు స్వీకరించారు. టిటిడి ఇన్‌ఛార్జి ఈఓ ,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి అభినందనలు తెలిపారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు.

# సోమల-సదుం మండలాలలో బర్డ్ ఫ్లూ కలకలం



సోమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: సోమల-సదుం మండలాలలో బర్డ్ ఫ్లూ కలకలం లేపుతుంది. సోమల సమీప ప్రాంతాలైన సదువు పుట్ట వారి పల్లి అమ్మ గారి పల్లి కోళ్ల ఫారాలల్లో వ్యాధి లక్షణాలతో వేల కోళ్ళు చనిపోవడం చర్చ నియాంశమైంది. విషయం తెలుసుకున్న అధికార గణం అప్రమత్తమైంది. సోమల పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసన్ నాయుడు కోళ్ల ఫారాలను సందర్శించి మృతి చెందిన కోళ్లను పరిశీలించారు. వ్యాధి లక్షణాలు కనుగొనేందుకు శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఏడు మాట్లాడుతూ ఇంతవరకు వ్యాధి ఏమిటో నిర్ధారించలేదన్నారు. ప్రజలు అపోహలు పోరాదని తెలియజేశారు. ముందు జాగ్రత్తగా చర్యగా ఐదు కిలోమీటర్ల పరిధిలో కోళ్లను తీసుకువెళ్లడం గాని వేరే కోళ్లను ఇక్కడికి తేవడం కానీ చేయరాదన్నారు. మృతి చెందిన కోళ్లను గోతి తీసి సున్నం వేసి పూర్తి వేయాలని ఫారాల్లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా గ్లౌజులు వాడాలని తెలియజేశారు. కోళ్ల ఫారాల పరిధిలో ఎలాంటి వెహికల్ అనుమతించరాదని తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ అయ్యేంతవరకు ఆ పరిధిలో కోడి మాంసం నిషేధించడమైందని తెలియజేశారు. రెండు మండలాలలో కోళ్ల ఫారాలు అధికంగా ఉండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు.

## కొలమాసనపల్లె జల్లికట్టు...
# ఎద్దు పొడిచి ఒకరు మృతి!



మృతిచెందిన నాగరాజు

పలమనేరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పలమనేరు రూరల్ మండలం కొమాసనపల్లెలో ఈ నెల 5న మధ్యాహ్నం నుండి రాత్రి 9 గంటల వరకు జల్లికట్టు వైభవంగా నిర్వహించారు. ఐతే జల్లికట్టులో అపశృతి చోటు చేసుకుంది. ఎద్దు పొడిచి చిన్న చెల్లారగుంటకు చెందిన నాగరాజు (45) మృతి చెందాడు. కొలమాసనపల్లెలో ప్రతి ఏటా జల్లికట్టు ఘనంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండే గాక సరిహద్దులోని తమిళనాడు, కర్నాటక నుండి కూడా పరుగుపందాలకు కోడెగిత్తలను తీసుకు వస్తారు. ఐతే జల్లికట్టు నిషేదమని పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నా నిర్వాహకులు మాత్రం పట్టిన పట్టు విడువకుండా జల్లికట్టు జరుపుకుంటారు. ఈ జల్లికట్టు చూడడానికి పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, కుప్పం, శాంతిపురం, పెద్దపంజాణి, గంగవరం, బంగారుపాళ్యం మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కూడా తండోపతండాలుగా వచ్చి తిలకిస్తారు. ఈ నేపథ్యంలో జల్లికట్టు చూడడానికి వచ్చిన చిననపప చెల్లారగుంటకు చెందిన నాగరాజును ఒక కోడెగిత్త పొడవడంతో రక్తం కారుతూ అక్కడే కుప్పకూలిపోయాడు. ఇతన్ని వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో మృతిచెందాడు. ఇక పరుగు పందాల్లో విజేతలుగా నిలిచిన గిత్తలకు మొదటి బమహుమతిగా రూ.75 వేలు ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు, ఇతర బహుమతులు మరో వంద వరకు అందజేశారు.

# ఆలీవ్ రిడ్లి తాబేల సంరక్షణ కేంద్రాల పరిశీలన

**-రాష్ట్ర అడిషనల్ పిసిఎఫ్ శాంతి ప్రియ పాండే**



వాకాడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మండలం కొండూరు పాలెం సముద్రం వద్ద ఆలివ్ రిడ్లి సంరక్షణ కేంద్రాలను రాష్ట్ర అడిషనల్ పి.సి.ఎఫ్ శాంతి ప్రియ పాండే పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొండూరు పాలెం సముద్రం తీరం వద్ద మడ అడవులను, ఆలీవ్ రిడ్లి సంరక్షణ కేంద్రాలను ఆమె పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్ని ప్రాణి భూభాగంకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మడ అడవుల పెంపకంపై పలు సూచనలు సలహాలు అందజేశారు, ఆలివి రిడ్లీ సంరక్షణ కేంద్రం ద్వారా పెంపకం ఎదుగుదలను మరింత పెంపొందించుకోవాలని ప్రత్యేక సలహాలు అందజేశారు. తాటి చెట్ల పెంపకమును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులికాట్ సరస్సు లేక్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధించిన అధికారులకు ఆమె సూచించారు. సముద్రపు ముఖ దారాలను ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, డీఎఫ్ఓ హారిక, ఫారెస్ట్ రేంజర్ డివి రమణయ్య, ఫారెస్ట్ అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు



**చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక సమావేశభవనంలో శుక్రవారం పలు అంశాలపై రెవెన్యూ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, డిప్యుటీ డైరెక్టర్ జయరాజు, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, నగరి అర్డీఓ అనుపమ, పలమనేరు అర్డీఓ భవానిలు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో డిఆర్‌ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అలాగే ఈ వర్క్‌షాప్‌లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పిఎంయు) ఏర్పాటు, వెబ్‌ల్యాండ్ అడంగల్‌పై సిసిఎల్‌ఎ సవరించిన సూచనలు, వెబ్‌ల్యాండ్ 2.0లో టెక్ప్యువల్, స్పేషియల్ డేటా సవరణ అంశాలపై డిఆర్‌ఓ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల 5వ తేదీ రెండు గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఈ వర్క్‌షాప్‌కు తహసిల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, డిప్యుటీ కలెక్టర్లు తదితరులు హాజరయ్యారు.

## అపోలోలో ఘనంగా ఫౌండర్స్‌డే ముగింపు వేడుకలు



**చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** చిత్తూరు మురకంబట్టులోని అపోలో నాలెడ్జ్ సిటీలో శుక్రవారం ఫౌండర్స్ డే-2026 వేడుకలు ఘనంగా ముగిశాయి. అపోలో వ్యవస్థాపకులు, పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు కేక్ కట్ చేసి ఫౌండర్స్ డే ముగింపు వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఫౌండర్స్ డే సందర్భంగా న్విహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, ఫౌండర్స్ డే చీఫ్ కో-అర్డినేటర్, అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జింటోమాధ్యు, అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్, అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయంతి, అపోలోఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి.జగదీషన్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ షనాజ్ ఎస్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

**పెనుమూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పెనుమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పెనుమూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట నరసింహ వన్‌టౌన్ ఎస్ఐగా బదిలీపై వెళ్ళడంతో చిత్తూరు విఆర్‌లో వున్న ఎస్ఐ శ్రీనివాసులును ఎస్పీ తుషార్ డూడి పెనుమూరు ఎస్ఐగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పక్కాగా పాటించాలని, ట్రాఫిక్‌క అంతరాయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి!

**తవణంపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండలంలోని టి.పుత్తూరు గ్రామ సమీపంలోని చెరువులో పడి వ్యక్తి మృతి చెంది వుండటంను శుక్రవారం స్థానికులు గుర్తించారు. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. పూతలపట్టు మండలం పాపానాయుడుపేట గ్రామంకు చెందిన జి.నందకుమార్ నాయుడు(48) ఈ నెల 1వ తేదీ తన సోదరుడు తవణంపల్లికి చెందిన మురళీప్పనాయుడు ఇంటికి వచ్చాడు. ఆ ఇంట్లో వుంటూ కూలీ పనికి వెళ్తానని చెప్పి గురువారం రాత్రి ఇంటి నుండి వెళ్ళాడు. ఇతను టి.పుత్తూరు చెరువులో పడి మృతి చెంది వుండటంను స్థానికులు గుర్తించి తవణంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంను పోలీసులు చెరువు నుండి వెలికితీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తవణంపల్లి పోలీసులు తెలిపారు.

## ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా నిత్యబాబు

**చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా నిత్యబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఇన్స్‌పెక్టర్ల బదిలీల్లో చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిత్యబాబు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఇక్కడి నుండి బదిలీ కావడంతో ఆ స్థానంలో నిత్యబాబు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



**చిట్వేలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** లాటరీలు, మొబైల్ పాస్వర్డ్, ఓటిపిల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిం చాలని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిధిలోని నాగవరం గ్రామం నందు ప్రజలకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఆన్లైన్ బెట్టింగులకు, మాదకద్రవ్యాలకు ముఖ్యం గా యువత దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యాంజలితో పాఠశాలల్లో సమూల మార్పులు.



**చిట్వేలి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ధాతలు, పూర్వ విద్యార్థులు సహకారంతో విద్యారంగంలో సమూల మార్పుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాంజలి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని విద్యాశాఖ అధికారులు ఖాజా మొయిద్దీన్, ఈశ్వరయ్యలు అన్నారు. శుక్రవారం కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి పాఠశాల నందు విద్యను అభ్యసించి ఉన్నత స్థితిలో ఉన్న పూర్వ విద్యార్థులు తమ గ్రామానికి తమ చదువుకున్న పాఠశాలకు సహాయం అందించడానికి ముందుకు రావాలన్నారు. వీలైతే తమలో ఉన్న జ్ఞానాన్ని అనుభవాలను అవకాశాలను పిల్లలతో పంచుకోవాలని పిలుపునిచ్చారు . హెచ్ఎం దుర్గరాజు మాట్లాడుతూ తాము విద్య నేర్చుకున్న చోటనే ప్రధానోపాధ్యాయుడుగా సేవలు అందించడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో హై స్కూల్ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ల ఉపాధ్యాయులు, సి ఆర్ ఎం టీ లు చంద్ర శేఖర్, రాజేష్, విజయ లక్ష్మి, స్వచ్చంద సంస్థ ల ప్రతి నిధులు, ఇంతియాజ్, సాయి, నరసింహ నాయుడు, రిటైర్డ్ టీచర్ శ్రీనివాసులు, ఆర్పీ లు వీరాంజనేయులు, మున్నీర్ అహ్మద్ బాషా, నారాయణ రెడ్డిలు పాల్గొన్నారు..

# రైల్వే కోడూరు డివిజన్

## అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఇస్మాయిల్



**చిట్వేలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రైల్వే కోడూరు తాలూకా ప్రెసిడెంట్ గా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెల్త్ సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్ భాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాధ్యుడు తెలియాపరిచారు. శుక్రవారం తాను మాట్లాడుతూ ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంఘం భజనతో కాక బాధ్యతతో పని చేస్తుందన్నారు. రైల్వే కోడూరు పరిధిలోని ఉద్యోగులు, వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా లేక రాష్ట్రస్థాయి లో వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఇస్మాయిల్ ఎంపిక పట్ల స్థానిక పిహెచ్సి సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ప్యాసింజర్ రైలును పుల్లంపేటలో ఆపండి



**పుల్లంపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** తిరుపతి నంద్యాల డెమో ప్యాసింజర్ రైలు ను పుల్లంపేట రైల్వేస్టేషన్లో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లంపేట మండలానికి చుట్టుపక్కల సుమారు 100 గ్రామాలు కలవని ఈ ప్రాంతం నుంచి వందల మంది ప్రజలు సదూర ప్రాంతాలైన నంద్యాల తిరుపతి పట్టణాలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి స్టేషన్ పుల్లంపేట కావడంతో వివిధ పనుల మీద తిరుపతి చేరుకో వాలంటే నంద్యాల డెమో ప్యాసింజర్ రైలు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

## బాబుల్ రెడ్డి..రూపానంద రెడ్డిపై ఆరోపణలా!



**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ముద్దా బాబుల్‌రెడ్డి నువ్వు మా నాయకుడు ముక్క రూపనందరెడ్డిపై విమర్శలు చేసే స్థాయి నీది కాదని పుల్లంపేట టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు, గంగిరెడ్డి అలియాస్ సుభాష్ లతోపాటు 15మంది పుల్లంపేటకి చెందిన నాయకులు తీవ్ర స్థాయిలో బాబుల్ రెడ్డిని విమర్శించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు టిడిపి కార్యాలయం నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మొదట మీ స్థాయి తెలుసుకొని మాట్లాడాలి అంతేగాని మా నాయకుడు సచీలతకు మారుపేరుగా ఉన్న రూపానంద రెడ్డి పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## సోమల హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు



**సోమల, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** సోమల జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 45 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు సదుం మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో చికిత్సలు నిర్వహించారు. సోమల ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి జై సింహ, విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమ సుధాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి జిఎస్ అమర్నాథ్. ఉపాధ్యాయ బృందం, వైద్య బృందం పాల్గొన్నారు

## వాటర్‌ట్యాంక్ పునఃప్రారంభం..

### తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం,-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పలమనేరు పట్టణానికి తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకును శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పునః ప్రారంభించారు. ఎద్దుల సంతవీధిలో గత 4 ఏళ్ళుగా మరమ్మత్తులైన వాటర్ ట్యాంకును రూ.4.50 కోట్ల వ్యయంతో మరమ్మత్తులు చేశారు. పలమనేరు రూరల్ మండలం కాలువపల్లె వద్ద నిర్మించిన కౌండిన్య ప్రాజెక్టు నుండి నీటిని దాదాపు 18 కి.మీల దూరం పైప్‌లైన్ల ద్వారా పలమనేరు పట్టణంలోని ఎద్దుల సంతవీది లోని వాటర్ ట్యాంకుకు తరలించి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఐతే వాటర్‌ట్యాంకుతో పాటు పైపల్‌లైన్లు కూడా మరమ్మతులు కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మరమ్మతులకు నిధులు విడుదలై పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే పునః ప్రారంభించారు. ఇంకా గాలేరు-నగరి, హంద్రీ-నీవా జలాలతో పాటు గంగన్న శిరస్సు వద్ద కొత్తగా నిర్మించే ప్రాజెక్టు నుండి కూడా నీటికి తరలించి పలమనేరు ప్రజలకు శాశ్వాత నీటి పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ కమీషనర్‌ఎంవిరమణారెడ్డి, నాయకులుఆర్‌వి బాలాజీ, గిరిబాబు, ఆర్‌బిసి కుట్టి, నాగరాజు పాల్గొన్నారు.

## గొల్లపల్లెలో వైభవంగా గంగజాతర



**పలమనేరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లె పంచాయితీ గొల్లపల్లెలో గంగ జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి మేళ తాళాలు, బ్యాండు వాయిద్యాలతో చీరసారెలు అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలుగుదేశం నాయకులు ఆర్‌వి బాలాజీ, గిరిబాబు, నాగరాజు. ఆర్‌బిసి కుట్టి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వాడకంపై అవగాహన సదస్సు



**బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం పంచాయతీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమం బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ చందర్, మండల సబ్ ఇన్స్పెక్టర్ చందన ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. మండలంలో విద్యార్థులు నిషేధత వస్తువులను ఎక్కువ సంఖ్యలో వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటిని అమ్మడం గాని సేవించడం గాని చట్ట పరంగా నేరమని, దీనికి శిక్ష పడుతుందని, ఎవరైనా ఇటువంటివి అమ్మినట్లయితే తమ దృష్టికి తేవాలని తెలియజేశారు. అనంతరం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి ఆధ్వర్యంలో ఎన్సిసి క్యాడర్ ద్వారా పంచాయతీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేయడం జరిగినది.

## శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



**రామకుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కెంచన బల్ల పంచాయతీలోని పచ్చారు మాకులపల్లి నుంచి రెడ్డివారి పోడు గ్రామం వరకు రాష్ట్ర నేత నారాయణ చారి కృషితో శ్రమదానంతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్యతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు దీంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్ సిసి రోడ్డు, బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజు నాయక్, పంచాయతీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, గుణశేఖర్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లికి రాహుకాలం అభిషేక పూజలు



**కల్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పులిచెర్లలో శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో స్వామి రాజశేఖర్ దీక్షితులు ఆధ్వర్యంలో అమ్మవారికి రాహుకాలంలో జరిగిన అభిషేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మురళి మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఎస్వీ రమణ, జై చంద్రారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రాము రెడ్డి, రాంబాబు, మహబూబ్ బాషా రెడ్డి, భాష, భక్తులు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



**చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రతి విద్యార్థికి అవగాహన పెంచాలని, ఈ విషయంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సౌజన్యంతో ఐటిసీ అండ్ ఎజిఎస్ వాన్ సంస్థల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెడ్మాస్టర్లు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళకు ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిఇఒ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణపై పాఠశాల స్థాయిలోనే ప్రత్యక్ష కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ, హ్యాబిట్ కార్డుల నమోదు, విద్యార్థుల రోజువారి కార్యక్రమాలపై ఐటిసి, సిజిసి మెంబర్ సెక్రటరీ గోపాలకృష్ణమూర్తి అవగాహన కల్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌లు హ్యాబిట్ కార్డు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, మండల విద్యాశాఖ అధికారి సెల్వరాజ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## బాల బాలికలకు ఆన్లైన్ ద్వారా ప్రవేశం

**ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాలయాలలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న ఖాళీలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయా కళాశాల ప్రిన్సిపాల్ భాష సంజీవపురం ఆడుపూరు ప్రిన్సిపాల్ హైమావతి మరియు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న పలు సాంఘిక సంక్షేమ శాఖ విద్యాలయాల ప్రిన్సిపాల్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత గల ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులను కోరుతున్నాము అన్నారు

## ముఖ్యమంత్రికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో లేఖలు



**పెనగలూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలో నేడు చక్రం పేట లో ఉన్నటువంటి ఉన్నత పాఠశాలలో 12వ పీఆర్‌సి కమిటీని వెంటనే నియమించి 29 మధ్యంతర భృతి మంజూరు చేయాలని. కోరుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకి యుటిఎఫ్ చేపట్టిన పోస్ట్ కార్డు క్యాంపెయిన్ లో భాగంగా పెనగలూరు మండలం చక్రంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయ మరియు ఉపాధ్యాయ బృందం సంతకాలు చేసి పోస్ట్ బాక్సు లో వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాల కృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. హరి ప్రసాద్, ఉపాధ్యాయులు అన్వర్ బాష, మహేంద్ర, సుదర్శన్, ప్రసాద రావు, శివ నరసింహులు, ప్రసాద్, వెంకట రెడ్డి, క్రిష్ణ కుమారి, ప్రమీల, శ్రీవాణి, పరిమళ, దేవమణి, షబాన తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : కందారపు



**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కార్మికుల సమస్యలు పరిష్కారానికి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని దేశవ్యాప్త శమిని విజయవంతం చేయాలని శుక్రవారం తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం మంగంపేట ఏపీ ఎంబీసీ ఆవరణంలో కార్మికుల ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ మరియు రేకులు గుంట వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు కందారపు మురళి మరియు ఓబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన జరుగు దేశ వ్యాప్త సమ్మెను కార్మిక నాయకులు కార్మికులు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఏపీఎండిసి సంస్థ ద్వారా మంగంపేట బ్రాంచ్‌లో వివిధ సమస్యల పరిష్కారానికి అలాగే దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు సమస్యలు పరిష్కరించి ఐక్యత వర్ధిల్లాలి విధంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికుల పాల్గొన్నారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పిఎస్‌లలో అంగన్‌వాడీ కేంద్రాల సమావేశం




**కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం ఎంఇఒ2 రాజారాం నేతృత్వంలో ప్రైమరీ స్కూళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై అంగన్‌వాడీ టీచర్లు, ఎస్ఎంసి ఛైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో సుమారు 16 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైమరీ స్కూళ్లల్లో ఏర్పాటు చేయాలని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఏదేని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. సమావేశంలో సిడిపిఒ చంద్రకళ, హెచ్ఎంలు మోహన్‌సింగ్, ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఎంసి ఛైర్మన్లు పాల్గొన్నారు.

## విద్యుత్ స్థంభాల తయారీ ఫ్యాక్టరీ పరిశీలన



**కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కుప్పం రెస్కో డైరెక్టర్లు తులసినాథ్, అమీర్, శివతేవర్, హారోగరన్ తదితరులు జిల్లాలోని జిడి నెల్లూరు వద్దగల ఉషోదయ విద్యుత్ స్థంభాల తయారీ పరిశ్రమను పరిశీలించారు. ఈసంస్థ ఎపిఎస్ఎండిసిఎల్‌కు విద్యుత్ స్థంభాలను సరఫరా చేస్తోందన్నారు. విద్యుత్ స్థంభాల తయారీ, నాణ్యతను పరిశీలించినట్లు రెస్కో డైరెక్టర్లు తెలిపారు. అలాగే చిత్తూరులోని శ్రీ బాలాజీ ఫ్లాబికేటర్ పరిశ్రమను సందర్శించారు.

## పాడిరైతులకు అండగా కూటమి ప్రభుత్వం



**కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాడి రైతులకు అండగా ఉంటోందని మొదలియార్ కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కూసూరు గ్రామంలో నూతన గోకులం షెడ్ నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు కనకరాజు, నేతలు బీరప్ప, మునిరత్నం, బాలు, వెంకటాచలం, వినోద్, గిరి, గణేష్, విజయ్ పాల్గొన్నారు.

## ఒంటరి ఏనుగు దాడిలో ఆవు మృతి



**రామకుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మండలంలోని పికెఎం తాండా గ్రామ శివార్లలో ఓ ఒ ంటరి ఏనుగు ఆవుపై దాడి చేయదంతో ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. ఒంటరి ఏనుగు గురువారం రాత్రి గ్రామ సమీపంలోని పంటపొలాలపై దాడులు చేస్తూ దేవేంద్రనాయక్ అనే రైతుకు చెందిన షెడ్ వద ్ద ఉన్న పాడి ఆవుపై దాడి చేసింది. దీంతో ఆవు మృత్యువాతపడిందన్నారు. ఆవు విలువ డెబ్బైవేల దాకా ఉంటుందన్నారు. కాగా ఏనుగులు గ్రామాలవైపు రాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు, నేతలు పేర్కొన్నారు.

## బంగారుకుటుంబానికి చిల్లరదుకాణం

**రామకుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండలంలోని పిఎంకె తాండాకు చెందిన మురళి, గీత దంపతులు 75వేల ఆర్థికసాయంతో గ్రామంలో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. ఈ దుకాణాన్ని శుక్రవారం నేతలు ప్రారంభించారు. సిఎం చంద్రబాబునాయుడు పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు పి4 కార్యక్రమం తెచ్చారన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు ఆనందరెడ్డి, కృష్ణానాయక్, విశ్వనాథ్, రవిరెడ్డి, మునిరెడ్డి, చంద్రబాబునాయక్ పాల్గొన్నారు.

## షూటింగ్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు వితరణ



**కుప్పం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** తిరుపతి ఎసీ వ్యయులో జరిగే సౌత్‌జోన్ షూటింగ్‌బాల్ చాంఫియన్‌షిప్ 2026పోటీలకు ఎంపికైన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ కుప్పం అధ్వర్యంలో బిసిఎన్ విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ సునీల్‌రాజ్ 18వేల విలువ చేసే క్రీడా దుస్తులు ఉచితంగా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తమవంతు సహకారం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, పిజి సెల్వం, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కుంకుమార్చన



**బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** విశ్వావసునామ సంవత్సరే మాఘమాసే కృష్ణపక్షే... అంటూ బోయకొండ గంగమ్మ నామస్మరణతో ఆలయం మార్మోగింది. శక్తిస్వరూపిణీ గంగమ్మ ఆలయంలో 3రోజులుగా జరుగుతున్న లక్షకుంకుమార్చన శుక్రవారంతో ముగిసింది. గంగమ్మకు ప్రీతిపాత్రమైన కుంకుమార్చనలో దాదాపు 500మంది దంపతులు ఉభయదారులుగా పాల్గొన్నట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఆలయంలో ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే గంగమ్మకు విశేషాభిషేకం, అలంకరణగావించారు. భక్తులందరికీ ఉచిత భోజన వసతి కల్పించారు. ఆలయ అధికార, సిబ్బంది, అర్చకులు సేవలందించారు.

## పొంగళ్ళు తెచ్చాము చల్లంగ దీవించమ్మా!



**చౌడేపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పొంగళ్ళు తెచ్చాము ఆరగించి చల్లంగా దీవించమ్మా...అంటూ భక్తులు మొకరిల్లి ముడుపులు చెల్లించారు. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లిలో పశువుల పండుగ, గంగజాతర్లను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామ దేవతలకు విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. మహిళలందరూ తెల్లవారు జామునుంచి పిండిదీపాలతో దేవతామూర్తులను ఆరాధించారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.82 కోట్లు ఆదాయం



**కాణిపాకం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.82 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 25 రోజులకు గాను హుండీల ద్వారా 1,82,25,471 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 11 గ్రాముల బంగారు, 910 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 17,200 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 1,57,895 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 481 అమెరికా డాలర్లు, 20 ఆస్ట్రేలియా డాలర్లు,1 మలేషియా రింగిట్స్, 12 సింగపూర్ డాలర్లు, 10 కెనడా డాలర్లు, 20యూరో కరెన్సీ, 1070 యూఏఈ దినార్స్,15 ఇంగ్లాండ్ ఫౌండ్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపుజిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ,ఏఈఓలు రవీంద్రబాబు,ధనుంజయ, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెం డెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్



**కాణిపాకం, ఫిబ్రవరి ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు లడ్డూల పంపిణీ



**కాణిపాకం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అంతరాలయ దర్శనం భక్తులకు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ శుక్రవారం అభిషేకం లడ్డూలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మురళీ కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శంచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ భక్తునికి అప్పగింత

**కాణిపాకం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఆలయ దర్శనార్థం వచ్చి స్వామివారి మొక్కుల్లో చెల్లింపులో భాగంగా పోగొట్టుకున్న బ్రాస్‌లెట్‌ను భక్తునికి తిరిగి అప్పగించిన సంఘటన కాణిపాకం ఆలయంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...యాదమరి మండలం వేపనపల్లెకు చెందిన దేవరాజులురెడ్డి అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చాడు. ఈసందర్భంగా మొక్కులు చెల్లింపులో భాగంగా ఆలయం వద్ద కొబ్బరి కాయాలు కొడుతూ చేతిలోని 15 గ్రాముల బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్నాడు. అక్కడ స్వీపర్ చినపాపమ్మకు ఆబ్రాస్‌లెట్ దొరకడంతో ఆమె బ్రాస్‌లెట్‌ను ఆలయ ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. ఈబ్రాస్లెట్‌ను పోగొట్టుకున్న భక్తున్ని గుర్తించి ఆలయ ఈఓ చేతుల మీదుగా అందజేశారు.

# తిరుపతి డివిజన్



## రమాదేవికి సంతాపం

**శ్రీకాళహస్తి, పిబ్రవరి 6 (ప్రభాతవార్త):** శ్రీకాళహస్తిలోని కొండమిట్టకు చెందిన వైకాపాకు చెందిన మైలాపూర్ లోకేష్ నానమ్మ మైలాపూర్ మిఠాయి వెంకట సుబ్బయ్య సతీమణి రమాదేవి, హఠాన్మరణం చెందారు. ఆమె మృతదేహానికి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి హాజరై సంతాపం తెలిపారు. రమాదేవికి నివాళుల ర్పించారు. ఆయనతో పాటు ఆశాకిరణ్, మురళి, లక్ష్మీ, మున్నారాయల్, బులెట్ జయశ్యాం రాయల్, మహాదేవ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ డీమ్డ్ వర్సిటీకి ఐసీసీ గోల్డ్ అవార్డు



**యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 6(ప్రభాతవార్త):** పర్యావరణం అనుకూల ఇంధనం ప్రతిభకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మక ఐసీసీ గోల్డ్ అవార్డు అందుకుంది. ఈ అవార్డును భారతీయ వాణిజ్య మండలి , కేంద్ర నూతన పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ,డెలాయిట్ సహకారంతో నిర్వహించిన 6వ గ్రీన్ ఊర్జా, ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్స్ కార్యక్రమంలో ప్రదానం చేశారు. యూనివర్సిటీ తరఫున రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు ఈ అవార్డును స్వీకరించారు. యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎర్రి. కోనేరు లక్ష్మణ్ హవిష్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ,సిబ్బంది సమిష్టి కృషికి ఈ అవార్డుప్రతిబింబమన్నారు.



## బడ్జెట్... ఆర్థిక పత్రం మాత్రమే

-ఆచార్య కెఎం నాయుడు

**యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 6(ప్రభాతవార్త):** ఇటీవల ప్రకటించినకేంద్ర బడ్జెట్ 2026-27పై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం విశ్రాంత ఆచార్య కెఎం నాయుడు బడ్జెట్‌పై వివరణాత్మక సందేశం ఇచ్చారు. పద్మావతి వర్సిటీ విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. ఆచార్య కాత్యాయనీ, డాక్టర్ పద్మావతి, డాక్టర్‌రూపన్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## ఆట కొత్త సీజన్ నేడే

**తిరుపతి,పిబ్రవరి 6(ప్రభాతవార్త):** తెలుగుప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాల్ని అందిస్తూ వినోదం పంచుతున్న జీతెలుగు ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడానికి రియాలిటీ షో జీ తెలుగు 'ఆట' నిర్వహిస్తోంది. షో 'ఆట' సరికొత్త సీజన్ నేటి సాయంత్రం ప్రారంభమై, ప్రతి శని, ఆదివారాల్లోరాత్రి 9గంటలకు ఆసక్తికరంగా సాగనున్న ఈ కార్యక్రమం ప్రేక్షకులనుఅలరించేందుకు ప్రసారం కానుంది.



## ప్రయాణీకుల భద్రతే లక్ష్యంగా విధులు

-తిరుపతి జీఆర్‌పి సిఐ వరప్రసాద్

తిరుపతి,పిబ్రవరి 6(ప్రభాతవార్త): రైల్వేప్రయాణీకుల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వ రైల్వేపోలీసులు పనిచేస్తారని తిరుపతి జీఆర్‌పి సిఐ ఎన్,.వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి జీఆర్‌పి స్టేషన్‌లో సిఐగా బాధ్యతలు చేపట్టారు. 2009 పోలీస్‌బ్యాచ్‌కు చెందిన ఆయన కడపజిల్లాలో ఎక్కువ కాలం ఎస్ఐగా పనిచేశారు.



## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్

**తిరుమల,పిబ్రవరి 6(ప్రభాతవార్తప్రతినిధి):** శ్రీవారిని శుక్రవారం ఉదయం నగరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్ దర్శించుకున్నారు. అనుచరులతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలపై సమగ్ర కార్యాచరణ

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో మోడల్ ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్ల(పీఎస్‌హెచ్‌ఎం) ఫోరం జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసి ఆర్థికేతర సమస్యలపై సమగ్ర ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని రాష్ట్ర ఫోరం కార్యదర్శి శ్రీనివాసులు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.వి.రమణ పుత్తూరులో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్‌హెచ్‌ఎంల నియామకాలు గందరగోళం పరిస్థితిలో జరిగిందని తెలిపారు. రానున్న ఏప్రిల్ నెలలో జరగనున్న బదిలీల్లో తిరిగి పీఎస్‌హెచ్‌ఎంలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి స్కూలు అసిస్టెంట్‌లుగా పంపించాలని డిమాండ్ చేశారు. పీఎస్‌హెచ్‌ఎంలను అడ్మినిస్ట్రేషన్ మాత్రమే పరిమితం చేస్తూ మోడల్ ప్రైమరీ స్కూలులో ఒక హెచ్‌ఎంతో పాటు 5 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

## పాఠశాల అభివృద్ధికి దాతల సేకరణ



**కేవీబీ పురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా విద్యాంజలి 2.0 నిర్వహించారు. మండలంలోని ప్రతి ఆహ్వానించి విద్యాంజలి 2.0 ముఖ్య అంశాలు మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మిపతి, రవికుమార్‌లు వివరించారు. ఒక పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల యొక్క ముందుకు తీసుకెళ్లే విధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ హెచ్‌ఎంలు కునాటి సురేష్, వెంకట కృష్ణయ్య, సీఆర్పీలు సూపర్, రవి, దేవసేన, ప్రమీల, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళపై యువకుడు దాడి అరెస్టు

వడమాలపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మహిళపై దాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. వడమాలపేట చాకలివీధిలో జయమ్మ ఉంటుంది. అదే వీధికి చెందిన రాజేష్(23) గురువారం ఉదయం జయమ్మ(53) ఇంట్లో ఒంటరిగా ఉండగా తలుపు తట్టి దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయపడింది. రాజేష్ తల్లికి జయమ్మ వడ్డీకి ఇవ్వగా డబ్బు ఇస్తాననే నెపంతో ఇంట్లోకి దూరి మహిళ ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో తీవ్రంగా గాయపడింది. కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్న వారు రావడంతో పారిపోయాడు. జయమ్మఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజేష్‌ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు.

## చెల్లింపులపై విచారణ చేయాలి

**విజయపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపనుల బిల్లుల చెల్లింపుల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీలోచేసిన పనులకు బిల్లులచెల్లింపులకు పొంతన లేకుండా ఉందని, దీనిపైసంబంధిత పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని ఆరోపిస్తున్నారు.

## ఘనంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల జోనల్ స్పోర్ట్స్ మీట్

**తిరుపతి విద్య ఫిబ్రవరి 6 ప్రభాత వార్త**



తిరుపతిలోని తుమ్మలగుంట క్రీడా మైదానంలో డాక్టర్ బి.ఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవి మనోహరాచారి, సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ (తిరుపతి), కెవిన్ కుమార్ డీఈవో ఎన్ . శశిధర్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ (తిరుపతి) విచ్చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ సూపరడెంట్ ఆఫ్ పోలీసు రవి మనోహరాచారి మాట్లాడుతూ ఒత్తిడితో కూరుకుపోయిన విద్యా విధానంలో శుక్రవారం జరిగిన శ్రీ చైతన్య క్రీడా కార్యక్రమాన్ని నుంచి సరికొత్త విధానంలో 2000 మంది విద్యార్థులతో మైదానంలో ఉల్లాసంగా అట్టహాసంగా క్రీడా కార్యక్రమాలు నెలకొల్పడం మంచి తరుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటువంటి శ్రీ చైతన్య యాజమాన్యానికి ,శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ కి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా మరో ముఖ్య అతిథి అయినటువంటి విద్యాసంస్థల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మున్ముందు కూడా ఉన్నతమైన స్థానానికి తీసుకు వెళ్తామని అందరి సమక్షంలో పిల్లలందరికీ అభినందనలు తెలియజేస్తూ ఇదే స్ఫూర్తితో ప్రతి సంవత్సరం కూడా డాక్టర్ బిఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ కొనసాగిస్తామని ఇంతకు పదింతలు గొప్పగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ కుమార్, స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ శశిధర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల, ప్రిన్సిపాల్ లు, ఏ ఓ లు, ఇన్చార్జిలు, పిఈటి టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## షర్మిల వ్యాఖ్యలు అవగాహనా రహితం

**పుంగనూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రెసిడెంట్ వై ఎస్ షర్మిల పట్టణంలో పర్యటన సందర్భంగా భారతీయ జనతా పార్టీ మరియు ప్రధాని నరేంద్ర మోదీ పట్ల తీవ్రమైన వ్యాఖ్యల పై పట్టణ బీజేపీ అధ్యక్షులు యం జగదీష్ రాజు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు షర్మిల వ్యాఖ్యలను ఖండించారు. ఉపాధి హామీకి కేవలం పేరు మాత్రమే మార్చారు కానీ పెద్ద మార్పులేమీ చేయలేదని తెలిపారు. ఎప్పటిలాగే ఉపాధిహామీ ద్వారా ప్రయోజనం పొందుతున్న పేద ప్రజలకు నష్టం వాటిల్లాదన్నారు. షర్మిల ప్రజలను మభ్యపెట్టి ఉనికి లేని కాంగ్రెస్ పార్టీని మళ్ళీ జనాలకి గుర్తు చేసే ప్రయత్నం చేశార న్నారు.వై ఎస్ షర్మిల బీజేపీ సాధించిన అభివృద్ధిని తెలుసుకోకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాల్ని మానుకోవాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని పై వై ఎస్ షర్మిల తాను చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మల్లికా రాణి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దమటం బాబు సీనియర్ నాయకులు అరవ పల్లి వెంకటరెడ్డి, టీఈఎస్ ప్రసాద్, ఉమ శంకర్, డాక్టర్ జగన్నాథం,విజయశంకర్,విజయభాస్కర్ రెడ్డి,దిలీప్, చిట్టెమ్మ, పురుషోత్తం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెడి కార్యాలయంలో సిబ్బంది కొరతను తీర్చండి



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** తిరుపతి జెడి కార్యాలయంలో సిబ్బంది కొరతను తీర్చాలని ఎంఎస్ఎంఈ చినబాబు జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పలు విషయాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేరవేయడంలో తీసుకోవలసిన చర్యలను వివరించారు. నారావారిపల్లిలో ప్రింటింగ్ క్లస్టర్, నారాయణవనంలో పవర్‌లూమ్ క్లస్టర్లు వుండే వివిధ దశల గురించి వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్లు రామమూర్తి, మురళి, టిడిపి నాయకులు, గుండయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

## పురాతన నాగదేవతల ఆలయానికి భూమి పూజ



**పుంగనూరు రూరల్ , ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** పట్టణంలోని పుణ్యమ్మ ఆలయం సమీపంలో ఉన్న పురాతన నాగదేవతల ఆలయానికి శుక్రవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన నాగదేవతల ప్రతిష్టలను గతంలో రోడ్డు విస్తరణ కారణంగా తొలగించాల్సి వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల కోరిక మేరకు నాగదేవతలను మళ్లీ ప్రతిష్టించేందుకు నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పగడాల పృధ్విధర్, టి.పి.ఎస్. నాగరాజా, దేవరాజు మాచర్ల రెడ్డెప్పతో పాటు పలువురు ఊరి పెద్దలు పాల్గొన్నారు.

## టువీలర్‌ను ఢీకొన్న పాల ట్యాంకర్....వ్యక్తి మృతి

**పెద్దపంజాణి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :**



పలమనేరు-మదనపల్లి జాతీయ రహదారిలో శ్రీరామపురం వద్ద శుక్రవారం రాత్రి ఓ పాల ట్యాంకర్ టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్సై మారెప్ప తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని పెద్దారికుంటకు చెందిన చిన్నరెడ్డెప్ప (60) శ్రీరామాపుర ఒకు వచ్చి టువీలర్‌లో ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో పాల ట్యాంకరు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## నవధాన్య అలంకారంలో శ్రీ విరుపాక్షిమారెప్మ

**పుంగనూరు రూరల్ , ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** పట్టణంలో శక్తి స్వరూపిణిగా విరాజిల్లుతున్న శ్రీ విరుపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు నవధాన్య అలంకారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ఉన్నత విద్య...విద్యార్థి దశలో తొలిమెట్టు



**రేణిగుంట ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఉన్నత విద్య అభ్యసించిన ప్రతి విద్యార్థి విద్యార్థి దశలో మొదటి మెట్టు అధిగమించినట్లేనని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు. రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ప్లస్ టు ఉన్నత పాఠశాల నందు శుక్రవారం 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుర ప్రముఖులు జబ్బర్, అడ్వకేట్ మోహన్ విద్యా కమిటీ సభ్యురాలు ప్రశాంతి, ప్రధానాచార్యులు శంకరి, విశ్రాంత ఉపాధ్యాయులు, జనార్ధన్, సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇరుగుపొరుగుతో సత్సంబంధాలు అవసరం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఇస్లాం మతం,దివ్యఖుర ఆన్ మనిషి జీవన విధానానికి సంబంధించి స్పష్టమైన సూచనలు చేస్తుందని దేవబన్ నుంచి వచ్చిన మత గురువు ముఫ్తి అషరప్ సాహెబ్ అన్నారు.శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన ప్రతి శుక్రవారం చదివే శ్లోకాలకు సంబంధించి వివరించారు. ఇది మనిషి జీవితంలో అలవాటు చేసుకుంటే ఆతని జన్మధన్యం అన్నారు. ముఖ్యమైనది వడ్డీలకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చేయరాని అంశాలకు సంబంధించి మాట్లాడుతూ ఇతరుల హక్కులను లాక్కోవటం,షరియత్‌ను పక్కన పెట్టి ఆల్లాహ్ ఆదేశాలను పెడచెవిన పెట్టి మన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించటం తగదన్నారు.

**సన్మానం:**

శ్రీకాళహస్తికి సమీపంలోని రామచంద్రాపురంలోని అరబ్బిమదరసాలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా వచ్చి ముఫ్తి అషరప్ అబ్బాస్‌ను శుక్రవారం హాఫీజే ఖుర్‌ఆన్ నసీం అఖ్తర్ సాహెబ్ ఇంటి వద్ద వైకాపా హయంలో వక్ఫ్‌బోర్డు తిరుపతిజిల్లా చైర్మెన్‌గా ఉన్న సిరాజ్‌బాషా,ఇస్మాయిల్ (లాలూ)లు దుశ్శాలువతో సత్కరించారు.

## జలవినాయకుని వార్షికోత్సవం: అన్నదానం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్టలో వెలసిన జలవినాయకుని ఆలయ 16వ వార్షికోత్సవంను భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది గుమ్మళ్ళ రాజేశ్వరరావు సారథ్యంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి విగ్రహానికి షోడశాభిషేకాలు నిర్వహించారు. తరువాత భక్తులకు అన్నదానం జరిపారు. కొండమిట్ట చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## నలుగురు యువకులు హాఫీజే ఖుర్‌ఆన్‌లు



**తొట్టంబేడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండలంలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న జామియా దారుల్ ఉలుమ్ ముహ్మదీయా మదరసాలో నలుగురు చిన్నారులు హాఫీజే ఖుర్ ఆన్ అయ్యారు. శుక్రవారం వారికి దారుల్ ఉలుమ్ దేవబన్‌కు చెందిన మత గురువు హజ్రత్ మౌలానా ముఫ్తి అష్రఫ్ అబ్బాస్ సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మరదరా నిర్వాహకులు హాఫీజే ఖుర్ ఆన్ నసీం అఖ్తర్ సాహెబ్ కొత్తగా ఖుర్‌ఆన్ కంఠస్థం చేసిన చిన్నారులను పరిచయం చేసారు. 666 పేజీల దివ్యఖుర్ ఆన్‌ను నాలుగు సంవత్సరాల్లో కంఠస్థం చేసారు. డిగ్రీ పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.షేక్ నయిం హైదరి, షేక్ మహమ్మద్ గుల్జార్ సయ్యద్ ఫైరోజ్, షేక్ మహమ్మద్ ఇర్షాద్‌లు డిగ్రీ పొందారు. ఈ సభలో మత గురువులు హాఫీజే ఖుర్ ఆన్ రేహన్, అబ్దుర్‌మతీన్‌అల్లాప్, మౌలానసుహేఫ్, షెహజాదా ఆలం,మున్షి ఖాదర్ అన్వర్ అలిలు పాల్గొన్నారు.



## 8వ వార్డు వైకాపా కమిటి

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వైకాపా నాయకులు చంద్రరాజు, ఆరిఫ్, నాగమ్మ, అమర్‌నాద్,వంశీ కృష్ణలు సమావేశమై అనుబంధ కమిటిలకు సంబంధించి చర్చించారు. పార్టీ పరిశీలకులు పఠాన్ ఫరీద్‌ఖాన్,పెరుమాళ్ చౌదరిలతో వార్డులోని పరిస్థితిని వివరించారు.ఈ కార్యక్రమాల్లోపార్టీ వార్డు నాయకులు మహబూబ్‌బాషా, లీలా కుమార్‌లు పాల్గొన్నారు.

## ఏర్పేడులో విద్యాంజలి 2.0



**ఏర్పేడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాంజలి 2.0 కార్యక్రమాలను నిర్వహించారు. ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాలను విద్యాశాఖాధికారి ఏ.దయాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాలలకు కావాల్సిన మౌళిక సదుపాయాలనుదాతల ద్వారా పూర్తి చేసుకొనుటకు ఉద్దేశించబడిందని విద్యాశాఖాధికారి వివరించారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యా యులు రిజిస్ట్రేషన్ చేసుకొని వారి పాఠశాలలకు అవసరమైన మౌళిక సదుపాయాలను సమకూర్చుకోవాలని విద్యాశాఖాధికారి సూచించారు.ఈ కార్యక్రమాల్లో విద్యాశాఖాధికారితో పాటు ఏర్పేడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మీ, సిఆర్పిలు మునీశ్వర్, వెంకటముని, సురేష్, మురళి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు,విష్ణులను అరెస్టు చేయాలి



**తిరుపతి విద్య ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఎంబీయూలో జరుగుతున్న అక్రమ ఫీజుల దోపిడీ అరికట్టాలని, మోహన్ బాబు, మంచు విష్ణును తక్షణమే అరెస్టు చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్వీ యూ ప్రకాశం భవనం ఎదుట బుధవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘ నాయకులు అక్బర్, వినోదులను ఎంబీయూకు చెందిన బౌన్సర్లు 40 మంది దాడి చేసి కిడ్నాప్ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన మోహన్ బాబును, మంచు విష్ణు ను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించాలని డిమాండ్ చేశారు.అశోక్ కుమార్,చిన్న ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రసన్నకుమార్,బండి చలపతి,సునీల్, మల్లికార్జున, రవి, ఉదయ్,ప్రవీణ్, పవిత్ర. భార్గవ్, యోగేష్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 32 మంది విద్యార్థులు డీబార్

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** ఎస్వీయూ పరిధిలో శుక్రవారం జరిగిన పలు కోర్సులకు సంబంధించిన యూజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ కు పాల్పడిన 32మంది విద్యార్థులను ఇన్స్పెక్షన్ అధికారులు డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్ఎస్‌యు సంస్కృత క్విజ్ పోటీలు



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** జాతీయ సంస్కృత వర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న నేషనల్ సాంస్క్రిట్ స్టూడెంట్స్ ఫెస్ట్2028కు విశేష స్పందన లభించింది. వర్సిటీలో మూడవ రోజు శుక్రవారం జరిగిన క్విజ్ పోటీలలో పలు సంస్కృత వర్సిటీలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ధర్మశాస్త్ర, మీమాంస, న్యాయశాస్త్ర, పురాణ ఇతియాస, సాంఖ్య యోగాశాస్త్ర వంటి వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్స్‌గా సాహిత్య విభాగ సహచార్యులు డాక్టర్ భరత్ భూషణ్ రత్, డాక్టర్ ప్రదీప్ కుమార్ భాగ్, అడిషనల్ కోఆర్డినేటర్గా వ్యాకరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఉదయన హెగ్డే వ్యవహరించారు.

## ఎస్వీయూ వీసీకి గౌరవ ఫెలోషిప్



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** విజయవాడ వేదికగా జరిగిన రక్షణ విజ్ఞాన సదుస్సులో ఎస్వీయూ వీసీ టాటా నర్సింగరావుకు అరుదైన గౌరవం లభించింది. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎసీ) ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ సదుస్సులో ఆయనకు ఏఎసీ గౌరవ ఫెలోషిప్ను ప్రకటించింది. విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథం ప్రోత్సాహంలో ఆయన చేసిన విశేష సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించారు.

## స్పెల్2 ప్రాక్టికల్స్‌కు 143 మంది గైర్హాజరు

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు స్పెల్2లో భాగంగా తొలిరోజు శుక్రవారం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 143 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ ఐఒ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షకు 3785 మందికి గాను 3897మంది విద్యార్థులు హాజరవగా మధ్యాహ్నం జరిగిన ప్రయోగ పరీక్షకు 3080 మందికి గాను 3025మందిహాజరయ్యారనితెలియజేశారు.ఇంటర్‌ప్రాక్టికల్స్ పరీక్షలుఈనెల10వతేదీవరకుజరగనున్నాయి.

## తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడుగా మాధవరెడ్డి



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి6 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ మండల రాజకీ యాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. పైడిపల్లి ఎంపిటిసి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి శుక్రవారం అధికారికంగా తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడుగా (ఎంపిపి) బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయంలో అత్యంత సరళంగా హంగులేని వాతావరణంలో కార్యాలయ ఏఓ రంగనాథం సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపిపిగా ఉన్న చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపిపి యశోద ఇద్దరూ దీర్ఘకాలిక సెలవులో ఉన్న విషయం అధికారికంగా వెలుగులోకి రావడంతో పాలనా శూన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు, జడ్పిసిఇఓ సూచనల మేరకు ఉప మండలా ధ్యక్షుడుగా ఉన్న విడుదల మాధవరెడ్డిని మండల అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. ఈ సందర్భంగా నూతన ఎంపిపి మాధవరెడ్డికి మాజీ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, వెంకట పతినగర్ సర్పంచ్ చిన్నియాదవ్, సి.గొల్లపల్లి సర్పంచ్ విడుదల రవిరెడ్డి, గాంధీపురం సర్పంచ్ మన్నూరు శివ, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, పలువు రు నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యాంజలి 2.0ను విజయవంతం చేయండి : జిల్లా ఎస్ఎస్ఎ ఎపిఓ



**నారాయణవనం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో ప్రవేశపెట్టిన విద్యాంజలి 2.0 కార్యక్రమంను విజయవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష ఎపిఓ భువనేశ్వరీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆమెతో పాటు పుత్తూరు ఉప విద్యాశాఖధికారిమహేశ్వరరావు, ఎంఇఓలు కోదండనాయుడు, జనార్ధన్‌రాజు, ఆర్పీలు, సిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాసుపుస్తకాలు పంపిణీ జరగాలి : జాయింట్ కలెక్టర్



**నారాయణవనం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాజముద్రతో ప్రచురించి అందిస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా అందించడానికి రెవెన్యూ అధికారులు పని చేయాలని జాయింట్ కలెక్టర్ గోవిందరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అరణ్యకండ్రిగ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ సమయంలో తప్పులు లేకుండా, అలాగే ఈకేవైసీ సమస్య లేకుండా జాగ్రత్త తీసుకొని నమోదు చేయాలన్నారు. త్వరలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి అంతా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రోజారాణి, సర్పంచ్ మురళి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ



**నారాయణవనం, పిబ్రవరి 6 ప్రభాతవార్త:** నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం ఊంజల్‌సేవ ఘనంగా జరిగింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు.

## పోలస్‌స్టేషన్‌ని తనిఖీ చేసిన నగరి డీఎస్పీ



**విజయపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని విజయపురం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరితో పాటు నగరి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, విజయపురం ఎస్ఐ మహేష్, ఏఎస్ఐ గోవిందరాజులు, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పిలివంక గ్రామస్థులు ఎంపిడిఓకు ఫిర్యాదు



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను నూర్పిడి చేసుకునేందుకు ఉపయోగించే కల్లామును ధ్వంసం చేసిన అనుపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉప్పిలివంక గ్రామస్థులు శుక్రవారం ఎంపిడిఓ పులిరామ్ సింగ్, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సుమారు 12 ఏళ్ళ క్రితం వాటర్ షెడ్ పథకం ద్వారా ప్రభుత్వం కల్లామును నిర్మించిందన్నారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ కొర్లగుంట నరశింహారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా జెసిబితో ఆ కాల్లామును పూర్తి ధ్వంసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన కల్లామును పునరుద్ధరించి తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

# అత్యవసరమైతేనే సిజేరియన్ డెలివరీలు : ఎంపీ



వెంకటగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: అత్యవసరమైతేనే సిజేరియన్ డెలివరీలు చేయించాలని లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి తెలిపారు. పార్లమెంట్‌లో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ డెలివరీలు అధికంగా జరుగుతున్న అంశంపై కీలక ప్రశ్న లేవనెత్తారు. ఇది తల్లులు, శిశువులు, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్న ప్రజా సమస్య అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో సిజేరియన్ డెలివరీలు గణనీయంగా పెరిగాయి. 2008-09 సంవత్సరంలో సుమారు 10 లక్షల సిజేరియన్ డెలివరీలు నమోదు కాగా, 2024-25 నాటికి ఈ సంఖ్య 54 లక్షలకు పైగా పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. అయితే మొత్తం ప్రసవాల సంఖ్యలో పెద్దగా మార్పు లేకపోయినా, సిజేరియన్ డెలివరీల వాటా మాత్రం వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని స్పష్టం చేసింది. ఈ పెరుగుదల ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎక్కువగా కనిపిస్తున్నట్లు ప్రభుత్వం అంగీకరించింది. సిజేరియన్ డెలివరీలు పెరగడానికి పలు కారణాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. తల్లి వయస్సు ఎక్కువగా ఉండటం, ఒకేసారి జంట లేదా ఎక్కువ గర్భధారణలు, శిశువుకు ఇబ్బందులు ఏర్పడటం, గతంలో సిజేరియన్ జరగడం, ప్రసవం ఆలస్యం కావడం, ప్లాసెంటా సంబంధిత సమస్యలు వంటి వైద్య కారణాలతో పాటు, కొన్ని సందర్భాల్లో రోగులు లేదా వారి కుటుంబ సభ్యుల అభిరుచులు కూడా నిర్ణయంపై ప్రభావం చూపుతున్నాయని వివరించింది. అయితే ఇదే కాలంలో దేశంలో శిశు మరణాల రేటు మరియు మాతృ మరణాల రేటు గణనీయంగా తగ్గాయని ప్రభుత్వం తెలిపింది. గత రెండు దశాబ్దాల్లో తల్లి మరియు శిశు ఆరోగ్యంలో మెరుగుదల రావడం ప్రభుత్వ పథకాలు, ఆసుపత్రి ప్రసవాల పెరుగుదల ఫలితమని పేర్కొంది. అనవసర సిజేరియన్ డెలివరీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సిజిహెచ్‌ఎస్ పరిధిలో ఉన్న ఆసుపత్రులు సాధారణ ప్రసవాలు మరియు సిజేరియన్ ప్రసవాల నిష్పత్తిని ప్రజలకు స్పష్టంగా ప్రదర్శించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో లక్ష్య కార్యక్రమం ద్వారా సిజేరియన్ డెలివరీలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని, ప్రసవ సేవలపై డేటా పర్యవేక్షణను మరింత బలోపేతం చేశామని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రసవం సహజ ప్రక్రియ అని, వైద్య అవసరం ఉన్నప్పుడు మాత్రమే సిజేరియన్ జరగాలని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసరంగా జరుగుతున్న సిజేరియన్ డెలివరీల వల్ల ప్రజలపై ఆర్థిక భారం మరియు ఆరోగ్యపరమైన ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తడం ద్వారా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. తల్లి, శిశువుల ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, ఈ విషయంలో ప్రభుత్వ పర్యవేక్షణ, ప్రజల అవగాహన, బాధ్యతాయుత వైద్య సేవలు అత్యంత అవసరమని ఆయన అన్నారు.

## సమస్యలను పరిష్కరించండి



వాకాడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మండలంలోని పంచాయతీల గ్రామంలోని ప్రజా సమస్యలతో పాటు సంక్షేమ పథకాలపై పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనసూయమ్మ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల సాధారణ సర్వసభ సమావేశం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు అనసూయమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు స్పందించాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ఎంతోమంది లబ్ధిదారులకు హౌసింగ్ బిల్లులు రాక పలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వెంటనే సంబంధించిన అధికారులు లబ్ధిదారులకు బిల్లులు పడేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా పంచాయతీలలో 15వ సంఘం ఆర్థిక బిల్లులు వచ్చిన పంచాయతీ ఖర్చులకు సరిపోలేదని తెలిపారు. తీరా ప్రాంత గ్రామాలలో ఉన్న పూడి రాయి దోరువు పంచాయతీకి సంబంధించిన గ్రామాలలో ఇప్పటివరకు విద్యుత్ స్తంభాలు వేయక పోవడం వల్ల రాత్రుల్లో వేళ్ళలో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతవాసులు తెలిపిన అధికారులు ఇప్పటివరకు స్పందించలేదన్నారు. రోడ్లు కూడా అధ్వాన స్థితిలో ఉన్నాయని వెంటనే అధికారులు ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి రోడ్లు వేయాలని తెలిపారు. తీర ప్రాంత గ్రామాలకు వచ్చే బస్సు కూడా ఆపేశారని వెంటనే బస్సులు వచ్చే విధంగా పునరుదించాలని అధికారు లకు ఆమె తెలియజేశారు. పంచాయతీలలో చెప్పుకోలేని బాధలు ఎన్నో ఉన్నాయని అవన్నీ పంచాయతీ సర్పంచులు అధిక ఖర్చులతో బాధ వేదన వ్యక్తం చేస్తున్నారని సర్వసభ సమావేశంలో అధికారులకు ఆమె సూచించారు. జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని పశువుల షెడ్డులు సక్రమంగా లేవని పాతి వాటికే బిల్లులు చేసుకున్నారని వెంటనే అధికారులు సరి చేయకపోతే ఏసీబీ అధికారులకు తెలియజేస్తానని జడ్పిటిసి రౌతు రామకృష్ణ అధికారులకు సరసభ సమావేశంలో తెలియజేశారు. సలహాదారుడు కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఆఖరి సర్వసభ సమావేశంలో అధికారులు ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టి, పంచాయతీలలో ఎలాంటి సమస్యలు ఉన్న సరిచేయాల్సిన బాధ్యత మీ మీద ఉందని కోరారు. ఈ ఆఖరి సాధారణ సర్వసభ సమావేశంలో ఎంపీటీసీలకు సర్పంచులకు దామోదర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ ఘన సత్కారం చేశారు. మొదటగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కల్లూరు సర్పంచి దువ్వూరు విజయ భాస్కర్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెంకట రమణయ్య, నిర్మల, ఎంఈఓ నశం అలీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, పిఆర్ఏఈ కిరణ్, ఏవో దీప, హౌసింగ్ ఏఈ భాస్కర్, ఏపిఎం పోలమ్మ, వైద్యాధికారి కమలాశ్రీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సూళ్లూరుపేటకు వైఎస్ షర్మిల రాక



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం సూళ్లూరుపేటకు రానున్నారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి నేరుగా ఆమె మండల పరిధిలోని కోటపోలూరు గ్రామానికి వెళ్లి అక్కడ రైతులతో, జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఇందుకు సంబంధించి సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఈ నెల 12వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ, సిపిఎం అనుబంధ సంఘాలు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగుకు కుదించడం తగదన్నారు. ఈ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మిక, కర్షక, రైతు సంఘాల వారు సహకరించాలని కోరారు.

## సూళ్లూరుపేటలో 483వ నేత్రదానం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు శుక్రవారం 483వ నేత్రదానం అందింది. కీర్తి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న కొండవేటి వెంకటేశ్వర్లు (65) మృతిచెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పులికాట్‌లో అడిషనల్ పిసిసిఎఫ్ పర్యటన



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సమీపంలోని పులికాట్ సరస్సును అడిషనల్ పిసిసిఎఫ్ శాంతిప్రియ పాండే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అటకానితిప్పలోని వన్యప్రాణి విభాగం పర్యావరణ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. పులికాట్ సరస్సుకు వచ్చే సందర్శకులకు కల్పించే సౌకర్యాలు ఫెడల్ బోటింగ్, క్యాంటిన్ సదుపాయాలు, పక్షుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై డిఎఫ్ఓ హారికను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిసిసిఎఫ్‌తో పాటు సిసి సెల్వం తదితరులు ఉన్నారు.

## రూరల్ టిడిపి అధ్యక్షులుగా పాకం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : మండల టిడిపి అధ్యక్షులుగా పాకం వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కలిసి తనకు పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలకు ధన్యవాదాలు తెలిపారు. సూళ్లూరుపేట రూరల్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పాకం వెంకటసుబ్బయ్య తెలిపారు.

## అధికార ప్రతిపక్ష పార్టీలు బిజెపి పార్టీ బానిసలు

**-రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి**



గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: శుక్రవారం నియోజక వర్గమైన గంగాధర నెల్లూరులో నిర్వహించిన గాంధీజీ జాతీయ ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర లో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష రాలు షర్మిల రెడ్డి గంగాధర నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర నెల్లూరు నియోజకవర్గ కన్వీనర్ డి. రమేష్ భారీగా మేళాలుతో ఘన స్వాగతం పలికారు. అనంతరం షర్మిల రెడ్డి ఎద్దుల బండిపై ర్యాలీగా సభా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష ముఖ్యమంత్రి ఇద్దరు బిజెపిపెద్దలకు తొత్తులయ్యారని అన్నారు. అలాగే ఇద్దరు కేంద్రం వద్ద ప్రతిపక్ష హోదా ఊసే ఎత్తలేదని దీనివల్ల మన రాష్ట్రంలో ఎందరో యువకులు నిరుద్యోగంతో మిగిలిపోతున్నారని వ్యవసాయం చేసుకుందామంటే ప్రస్తుత బడ్జెట్లో ఎరువులపై సుంకం పెంచారని సభల్లో మాత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని అన్నారు. అలాగే అధికారంలో ఉన్నప్పుడు జగన్‌కు జల ప్రాజెక్టులు గుర్తు రాలేదని అధికారంలో లేనప్పుడు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రస్తుతం ప్రాజెక్టుల గురించి ప్రస్తావన మొదలెట్టాడని ఎద్దేవా చేశారు. గాంధీజీని ఆర్ఎస్ఎస్ సభ్యుడు గాడ్సే చంపాడని ప్రస్తుతం గాంధీ ఆశయాలను నరేంద్ర మోడీ చంపేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు కార్యకర్తలు రైతులు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని రాజన్న ముద్దుబిడ్డ షర్మిల రెడ్డి గారికి జేజేలు పలికారు.

## ఒకే వేదికపై ఇద్దరు

**- అట్టహాసంగా ఇళ్ల పట్టాల పంపిణీ- వరదయ్యపాలెం మండలం ఇటు స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం**

**- అటు అధికార పార్టీ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి**



వరదయ్యపాలెం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మధ్యలో జిల్లా పాలన అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ కూటమి పార్టీ నేతలు నాయకులు సమక్షంలో వరదయ్యపాలెం మండలంలో వరదయ్యపాలెం పంచాయతీ అనిల్ పురం బిజిఆర్ ఎస్టి కాలనీ వాసులు కాలువ గెట్‌కు అంచున నివసిస్తున్న ఉన్నారు. వారు ఎన్నో ఏళ్లుగా కార్యాలయం చుట్టూ ఇళ్ల స్థలాల కోసం తిరుగుతూ ఉన్నారు. నేటితో కూటమి ప్రభుత్వం వారు కష్టాలను తీర్చింది గిరిజన కాలనీకి ఇంటి పట్టాలు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. హట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు అనంతరం రీ సర్వే జరిగిన ప్రాంతంలో పాస్ బుక్కులు పంపిణీ చేశారు అనంతరం ప్రజల దగ్గర్నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలు కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, వరదయ్యపాలెం మండలం, బుచ్చినాయుడు కండ్రిక మండలం, తాసిల్దార్లు, సుధీర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, యుగంధర్ రెడ్డి, బుచ్చినాడు కండ్రిక తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు వరదయ్యపాలెం ఎంపీపీ, పద్మ ప్రియ, బిజెపి పార్టీ అధ్యక్షులు, దిలీప్ రాయల్, జనసేన పార్టీ, అధ్యక్షులు చిరంజీవి యాదవ్, తిరుపతి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి తడ శ్రీనివాసులు, సింగల్ విండో చైర్మన్, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, డివిఎంసి నెంబర్ గుత్తి త్యాగరాజు, వరదయ్యపాలెం సర్పంచ్ జ్యోతి, సూర్యనారాయణ, వాసురెడ్డి, శుభ రత్నమ్మ, రెండు మండలాల, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## బోగస్ పత్రాలతో...కళాశాల స్థలం కబ్జాకు యత్నాలు

వెంకటగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాలకు తప్పుడు పత్రాలు సృష్టించి దురాక్రమణకు పాల్పడుతున్న ల్యాండ్ మాఫియాపై సిబిసిఐడి విచారణ జరపాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. వెంకటగిరి పట్టణం నడిబొడ్డున ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాలను రియల్ మాఫియా దురాక్రమించేందుకు తప్పుడు పత్రాలు సృష్టిస్తూ అమ్మి కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక పల్లె వీధిలోని కామ్రేడ్ కాళహస్తి శేషయ్య స్మారక భవనం నందు పౌరసమితి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను, అమ్మవారిపేట చెవిరెడ్డిపల్లి చెరువు పోరంబోకులను, కైవల్యా నది తీరప్రాంతాన్ని రక్షించుకునేందుకు పట్టణ పౌరులు, పౌర సంస్థలు పూనుకోవాలని పిలుపునిచ్చారు. పౌరసమితి అధ్యక్షులు బికె ప్రసాద్ మాట్లాడుతూ మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా సమితి భవనాలు ఉన్న సర్వే నెంబర్ 199-5 లోని ఏ 1.32 సెంట్లు ప్రభుత్వస్థలానికి అబ్దుల్ కరీం పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించారని, సర్వే నంబర్ 199-4 లో ఉన్న 1- 50 ఎకరం కళాశాల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలానికి పత్రాలు సృష్టించారన్నారు. వీరి వెనకాల బలమైన వ్యక్తులు లేకుండా సాధ్యం కాని పనని కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు రక్షించబడాలంటే రాష్ట్ర ప్రభుత్వం సిబిసిఐడి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వేలంపాటల్లో పాడగా మిగిలివున్న విశ్వోదయ స్థలాలు కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతుకూలీ సంఘం నాయకులు గంగల పూడి కృష్ణారెడ్డి, పిడిఎస్ఓ ఏరియా కన్వీనర్ సిహెచ్ పవన్, పౌర సమితి సభ్యులు ఐ ధనంజయ పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య!

బాలాయపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మండలంలోని జయంపు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరి వేసుకున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతుడు హస్త కావేరి గ్రామానికి చెందిన గుర్రాల హనుమంతరావుగా పోలీసులు గుర్తించారు. కుటుంబ కలహాలతో హస్తకావేరి గ్రామానికి చెందిన గుర్రాల హనుమంతరావు (24) అనే యువకుడి వేసుకొని బలవన్మరణం కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 12 దేశవ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె



వెంకటగిరి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీ జరుగు సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అంగన్వాడీల డిమాండ్స్ తో కూడిన కరపత్రం అంగన్వాడీలు విడుదల చేయడం జరిగింది. ఈనెల 12, న లేబర్ కోడ్స్ రద్దు, అంగన్వాడీ వర్కర్లు-హెల్పర్లకు కనీస వేతనం రూ.26,000, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, ఇతర కోర్కెల పరిష్కారం కోసం జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.పి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్. స్వరూప రాణి, ప్రాజెక్టు అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న, వరలక్ష్మి, విజయమ్మ, రమణమ్మ, తులసి, అన్నపూర్ణ, ప్రాజెక్ట్ లీడర్స్ ప్రభావతి, రమా, ఉష, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఉండే అర్హత లేదు: ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ లు కల్తీ నెయ్యిపై నిజాలు ప్రజలకు తెలపడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు భయం పట్టుకుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. ఎన్డీఏ కూటమి కల్తీ నెయ్యిపై నిజాలు చెబుతుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు ఉపయోగించే నెయ్యి కల్తీ జరిగిన మాట నిజమని మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఒప్పుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శ్రీవేకంటేశ్వర స్వామే వైవి సుబ్బారెడ్డి చేత నిజం చెప్పించారని ఆయన తెలిపారు. కరుణాకర్‌రెడ్డి మాత్రం అబద్దాలను ఇంకా ప్రచారం చేస్తున్నాడని ఆయన చెప్పారు. దేవుడు రాయి అన్న కరుణాకర్ రెడ్డి రెండుసార్లు టిటిడి ఛైర్మన్‌గా చేసినా హిందువుల మనోభావాలు దెబ్బతీశాడని ఆయన ఆరోపించారు. శ్రీవారు మంచి బుద్ది కరుణాకర్ రెడ్డికి కలిగించి నిజం త్వరలోనే చెప్పిస్తారన్న నమ్మకం తమకు ఉందని ఆయన తెలిపారు. తన కొడుకు హిందూ ధర్మం ప్రకారం, తన కుమార్తెకు క్రిస్టియన్ పద్దతిలో పెళ్ళి చేసిన కరుణాకర్ ఒడ్డికి హిందువుల మనోభావాలు పట్టవని ఆయన అన్నారు. అబద్దాల కరుణాకర్ రెడ్డికి పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ఉండే అర్హత లేదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ సికె రేవతి, డాక్టర్ వనజ, సుభాషిణి, రాజా రెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి, దూది శివ, తిరుత్తణి వేణుగోపాల్ , ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచ్చారి, పోటుకూరు ఆనంద్, కొండా రాజమోహన్, రమేష్ నాయుడు, హెచ్ డి ఎస్ సభ్యులు మునస్వామి, దిలీప్, లచ్చి, భరత్, శిరీష, రాధ తదితరులు పాల్గొన్నారు



తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట నందు ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కార్యక్రమానికి విచ్చేసిన పిసిసి కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డికి తిరుపతి తాజ్ హోటల్ నందు స్వాగతం పలికిన గౌడపేరు చిట్టిబాబు, మాంగాటి గోపాల్‌రెడ్డి తదితరులు.

-ప్రభాతవార్త- తిరుపతి

# సూళ్ళూరుపేట డివిజన్

## పంటల దిగుబడిపై అంచనాలు వేయాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పంటల దిగుబడి పై క్షేత్రస్థాయిలో అంచనాలు వేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. వరి ధాన్యం క్రాప్ కటింగ్ ప్రయోగంపై విపిఏలతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన వ్యవసాయశాఖాధికారిని ఏ.ఎస్.ఓ.రాజు క్షేత్ర స్థాయిలో పంటల దిగుబడిని అంచనా వేయడానికి ఈ పంట కోత ప్రయోగంపై సమావేశం నిర్వహించారు. ఈక్రాప్ నమోదు చేయని వారు ఆన్లైన్ చేసుకోవాలి ఏ.ఎస్.ఓ.రాజు తెలిపారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే మందులు



బాలాయపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: కుష్టు వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే మందులు తీసుకొచ్చి అందజేస్తామని వైద్యాధికారి డాక్టర్ లిఖిత తెలిపారు. స్పర్శ" లెప్రసి అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు ఈ నెల 13 వరకు జరుగుతాయి అని చెప్పారు. కుష్ఠువ్యాధి మైక్రో బాక్టీరియం లేప్రే అనే బాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. దీనిని పన్నెండు నెలల కాల వ్యవధిలో పూర్తిగా నయం చేయవచ్చు నని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య కార్యకర్త వద్ద ఎం.డి.టి. మందులు ఉచితంగా అందజేస్తామన్నారు.

## మహిళలకు ఫలసరుకులు పంపిణీ



వాకాడు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శుక్రవారం శ్రీ పట్టాభి రామాలయంలో శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవిరెడ్డి వసంత కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రామిరెడ్డి వేంకట రామిరెడ్డి, హైమావతమ్మ, మధు కిరణ్ రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో ఆర్థికంగా వెనకబడిన ముగ్గురు మహిళలకు ఫలసరుకులు, కూరగాయలు, రొఖ్ఖం సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పారా హేమంత్ కుమార్ శర్మ, కోన సాయిబాబు శర్మ, మల్లాపు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వోద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మెల్యేకు వినతిపత్రం**



పుత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : ఈ నెల 11వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వోద్యోగుల సమస్యలు ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ప్రభుత్వో ద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం తిరుపతిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పిఆర్‌సి అమలు చేయాల్సి వుందన్నారు. అలాగే కరువు భత్యం బకాయిలు, మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు వై.జె.పి.ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.లక్ష్మీపతి, పుత్తూరు తాలూకా అధ్యక్షుడు జి.రవికుమార్, కార్యదర్శి జి.మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడు దీపక్, ఉప కార్యదర్శి ఆర్.మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బి.శాంతిదుర్గ తదితరులు వున్నారు.

**దేశంలోకి వైకాపా వలసలు...**

## పావులు కదుపుతున్న నాయకులు



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలో వైకాపా పార్టీని నిర్వీర్యం చేయటానికి తెలుగుదేశం మండల నాయకులు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపేడు పరిసరాల్లో వైకాపాకు మద్దతుగా ఉన్న సుమారు 150 మంది కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకర్షించారు. వారిని శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారధ్యంలో పసుపు కండువాను వేసి పార్టీ సభ్యత్వంను అందించారు. ఈ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, యువనాయకుడు తాటిపర్తి రవీంద్రరెడ్డిల కృషితో మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయటానికి పావులు కదుపుతున్నారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేకుండా ఉండాలని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ద్వితీయశ్రేని నాయకులు చొరవ చూపతున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలకు పెరుగుతున్న నమ్మకానికి ఈ భారీ చేరికలే నిదర్శనం అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై నమ్మకం పెరిగి భాగస్వాములు కావాలని ఉవ్విళూరుతున్నారని పార్టీలో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అందరం కలసి కట్టుగా పని చేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంను ప్రగతి పథంలో నడిపిద్దామని పిలుపు నిచ్చారు. ఈ సందర్బంగా కార్యకర్తలు ఈశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిని సత్కరించారు.

## 35ఏళ్ళ చెట్టును నరికేశారు

**-విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని నాగుల గుంటకు చెందిన వెంకటేష్ ఇంటి ముందు సుమారు 35 సంవత్సరాలుగా ఉన్న మల్లె చెట్టును విద్యుత్‌శాఖ అధికారులు తాము ఇంటిలో లేని సమయంలో మొదలు నరికేశారని బాధితుడు గురువారం విద్యుత్‌శాఖ ఎడిఇ దృష్టికి తెచ్చారు. ఎక్కడో మారుమూల ఉన్న తమ ఇంటి ముందు ఉన్న పచ్చని చెట్టును ఎందుకు నరికివేసారని ప్రశ్నించారు. 35 సంవత్సరాలుగా ఇక్కడ విద్యుత్ లైన్ ఉందని అధికారి దృష్టికి తెచ్చారు. ఒకవేళ విద్యుత్ లైన్‌కు అడ్డం అయితే తమకు సమాచారం ఇస్తే ఎంత అడ్డమో అంతరకు తీసి వేస్తామన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌లైన్లకు ఎంత వరకు అడ్డం ఉంటే అంతే తొగిస్తారు తప్ప చెట్టు మొదలకు నరికివేశారని వెంకటేష్ విద్యుత్ అధికారి దృష్టికి తెచ్చారు.

## 14న పట్టు వస్త్రాలు సమర్పణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో 14వ తేదిన ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా సమర్పించాలని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, తాను దేవాదాయశాఖ అధికారులు కోరామని అయితే బడ్జెట్ సమావేశం ఉండవచ్చుని కాబట్టి తననే నియమించినట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**శివయ్య సేవలో అతిధులు:**

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కార్యదర్శి హరి జవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్ రాగా వారికి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఘనస్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి చైర్మెన్ కొట్టే సాయి ప్రసాద్, ఇఓ టి.బాపిరెడ్డిలు ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. వారితో పాటు బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, జి.గోపినాధ్, కొమ్మనబోయిన రజని, పి.హేమావతి, డి.లక్ష్మమ్మ, కళ్ళ సావిత్రిలు స్వాగతం పలికారు. ఏర్పాట్లును డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరచుకొందాం

**-టిటిడి నూతన ఈఓ ముద్దాడ**



తిరుమల, ఫిబ్రవరి 6(ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా ప్రతి అధికారి, ఉద్యోగి నిజాయితీ, అంకితభావంతో సేవలందించాలని నూతన టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర అభిప్రాయం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి ఆశయాలకనుగుణంగా కాపాడటంలో అందరూ కలసి పనిచేద్దా మని స్పష్టం చేశారు. నూతన ఈఓగా శుక్రవారం ఉదయం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు చేపట్టిన తరువాత అన్నమయ్య భవనంలో, తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో అన్ని విభాగాధిపతులు, ముఖ్యమైన అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. టిటిడి ఇన్‌ఛార్జి, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జెఈఓలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

**పాస్ పోర్టు పోయినది**

మోచర్ల కీర్తి, భర్త హరిప్రసాద్, 8/62 రంపావారి పల్లి (గ్రామం, తుమ్మచెట్లపల్లి (పోస్టు), చిట్వేలి (మం), అన్నమయ్య జిలాన-516 128, ఏపి. మా గ్రామం నుండి జిరాక్స్ కొరకు చిట్వేలికి ప్రయాణిస్తుండగా నా కవరు, అందులోని పాస్ పోర్టు నెంబరు : వి5866294 పోయినది. దొరికిన వారు 8008569085 ఈ నెంబరుకి తెలుపుగరు.